సాక్షి
యాదాద్రి భువనగిరి
సోమవారం । 26 । జూన్ । 2023



హైవేపై.. పోలీస్ ఫోకస్ !

హైదరాబాద్–విజయవాడ హైవేపై ప్రమాదాల నివారణకు పోలీస్ యంత్రాంగం చర్యలు చేపట్టింది. - 8లో



మెనూ పాటించాలని ధర్నా

మోత్కూరులోని బాలుర గురుకులంలో మెనూ పాటించడం లేదంటూ విద్యార్థి సంఘాలు ధర్నా చేశాయి. - 10లో

గరిష్టం/కనిష్టం
32° / 25°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గుండాల, రామన్నపేట, వలిగొండ : హాకీంపేట క్రీడా పాఠశాలలో 4,5 తరగతుల్లో ప్రవేశానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయా మండలాల ఎంఈఓలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తొమ్మిది అంశాల్లో క్రీడా పోటీలు ఉంటాయన్నారు. గుండాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల, వలిగొండలో శ్రీ వెంకటేశ్వర జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోటీలు నిర్వహించనున్నారని వెల్లడించారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు విద్యార్థులు జనన ధ్రువీకరణ పత్రం, బోనాఫైడ్, ఆధార్ కార్డు, రెండు పాస్ ఫొటోలతో మండల ఇన్‌చార్జిలను కలవాలని కోరారు. రామన్నపేటలో వివరాలకు 9912779091 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి



కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న సూదగాని హరిశంకర్‌గౌడ్

బొమ్మలరామారం : బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సూదగాని హరిశంకర్‌గౌడ్ అన్నారు. 'మహాజన్ సంపర్క్ అభియాన్'లో భాగంగా ఆదివారం బొమ్మలరామారం మండలం ఫక్కీరుగూడెంలో ఇంటింటికి బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను కరపత్రాల ద్వారా ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో దూసుకెళ్తుందన్నారు. రాష్ట్రంలోనూ బీజేపీకి రోజురోజుకూ ఆదరణ పెరుగుతుందన్నారు. బీజేపీని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జగ్గర్ల ఆనంద్ గౌడ్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు వేముల నరేష్, మండల ఉపాధ్యక్షుడు గులారి నర్సింహ, మైలారం ఉపసర్పంచ్ సిద్దెంకి బాబు, మూడుగుల అంజనేయులు, బొబ్బిలి రాజిరెడ్డి, బోయిని రాజు, గంగాదేవి బాలరాజు, గంగాదేవి సాగర్, గుల్లని మధు, సిద్దెంకి మల్లేష్ పాల్గొన్నారు.

హక్కులను హరిస్తున్న పాలకులు



సదస్సులో మాట్లాడుతున్న హరగోపాల్

నల్లగొండ టౌన్ : భారతదేశంలోని ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను పాలకులు హరిస్తున్నారని.. దీనిపై ప్రశ్నించకుంటే భవిష్యత్ తరాలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు అందవని ప్రొఫెసర్ హరగోపాల్ పేర్కొన్నారు. ఆదివారం భారత్ బచావో సంస్థ ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణంలోని టీఎన్జీఓ భవన్లో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ దేశంలోని సంపదను అన్ని వర్గాల ప్రజలు సమానంగా అనుభవించాలని మన రాజ్యాంగంలో రాసుకునప్పటికీ పాలకులు మాత్రం కొందరి కోసమే అన్నట్లుగా పనిచేస్తున్న తీరు ఆందోళన కలిగిస్తోందన్నారు. 75 సంవత్సరాల స్వతంత్ర దేశంలో పాలకులు పేదల కోసం ఏం చేశారని చూస్తే ఏమీ కనిపించదు.. కానీ, పెట్టుబడిదారుల కోసం మన రాజ్యాంగంలో రాసుకున్న చట్టాలను అధిగమించి పంచుతున్నారని చెప్పారు. వచ్చే కుంభమేళాలలో సాదు సన్యాసులు రాసుకున్న రాజ్యాంగం అమలుకు శ్రీకారం చుడతారని హెచ్చరించారు. ఈ దేశంలో సాగుతున్న పాలన గురించి ప్రశ్నించే తన లాంటి వారిపైన కేసులు నమోదు చేస్తున్నారని చెప్పారు. మన దేశాన్ని కాపాడుకోవడానికి భారత్ బచావో సంస్థ చేస్తున్న కృషికి ప్రజలు ప్రజాస్వామిక వాదులు అండగా ఉండాలని సూచించారు. సమావేశంలో భారత్ బచావో జాతీయ కన్వీనర్ ఇన్నయ్య, జహీర్ అలీఖాన్, డాక్టర్ ముప్పరామారావు, ఎంఫ్ గోపినాథ్, దర్శనం నర్సింహ, సుంకిరెడ్డి నారాయణరెడ్డి, అలెగ్జాండర్, చింతల యాదగిరి పాల్గొన్నారు.



వైరస్ సోకడంతో ఎండిపోయిన వేప చెట్టు



ఎండిన చెట్టుకు ట్యాంకర్‌తో నీటిని పడుతున్న పంచాయతీ సిబ్బంది



చిగురించి మళ్లీ పచ్చగా మారిన చెట్టు

చెట్టు చిగురించింది

ఆత్మకూరు(ఎం) : మండలంలోని కూరెళ్లలో సుమారు 200 ఏళ్ల నాటి వేప చెట్టు అది. గ్రామం నడిబొడ్డున ఉన్న ఈ చెట్టు చుట్టూ రచ్చబండ ఉండడంతో ఊరిపెద్దలు ఇక్కడే పంచాయతీలు పరిష్కారం చేస్తుంటారు. అంతేకాదు.. మధ్యాహ్న సమయంలో చెట్టు నీడన ఎంతోమంది సేదదీరుతుంటారు. కాగా ఇటీవల వైరస్ సోకవడంతో చెట్టు ఎండిపోయింది. తమ గ్రామానికి తలమానికంగా ఉన్న భారీ వృక్షాన్ని ఎలాగైనా కాపాడుకోవాలని సర్పంచ్ బాషబోయిన ఉప్పలయ్యయాదవ్ సంకల్పించారు. ఎరువు వేయించి పంచాయతీ సిబ్బందితో వారానికి రెండు,మూడు సార్లు నీళ్లు పట్టించాడు. ప్రస్తుతం చెట్టు చిగురించి యథాస్థితికి వస్తుంది.

గడువు దాటితే భారమే!

అర్ధవార్షిక ఆస్తిపన్ను గడువు ఈనెల 30

- ఆలోపు చెల్లించకపోతే పడనున్న వడ్డీ
- పన్ను మొత్తంపై ప్రతి నెలా 2 శాతం వడ్డింపు
- ప్రజల్లో అవగాహన లేమి
- నోటీసులు జారీ చేస్తున్నా ముందుకు రాని భవన యజమానులు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : మున్సిపాలిటీల్లో గడువులోగా ఆస్తిపన్ను చెల్లించకపోతే వడ్డీ భారం పడనుంది. ఈ నెల 30వ తేదీ దాటితే ప్రతి నెలా 2 శాతం చొప్పున వసూలు చేసేందుకు మున్సిపల్ యంత్రాంగం సిద్ధమవుతోంది. నిబంధనల ప్రకారం మున్సిపాలిటీల్లో భవన యజమానులు ఏటా రెండుసార్లు (ఆరు నెలలకు ఒకసారి) ఆస్తిపన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు అర్ధ సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్ను జూన్ నెలాఖరులోగా చెల్లించాలి. కానీ, ఏటా ఫిబ్రవరి, మార్చి నెలలో చెల్లిస్తే సరిపోతుందనే భావనలో ప్రజలు ఉంటున్నారు. అవగాహన లేకపోవడంతో వడ్డీ చెల్లించక తప్పడం లేదు.

మందకొడిగా వసూళ్లు

▸ భువనగిరి మున్సిపాలిటీలో 14,500 భవనాలు ఉన్నాయి. వీటినుంచి రూ.8.47 కోట్ల ఆస్తిపన్ను రావాల్సి ఉంది. అందులో మొదటి ఆరు నెలల్లో రూ.4.23 కోట్లు రావాల్సి ఉండగా 1,987 భవన యజమానులు రూ.1.42 కోట్లు చెల్లించారు. ఇంకా రూ.2.81 కోట్లు వసూలు కావాల్సి ఉంది. జూన్ దాటితే ఆలస్య రుసుముతో చెల్లించాల్సి వస్తుందన్న విషయాన్ని పెద్దగా ప్రచారం చేయకపోవడంతో ప్రజల్లో అవవాగాహన లేకుండాపోయింది.

▸ యాదగిరిగుట్ట మున్సిపాలిటీలో 4,700 నిర్మాణాలు ఉన్నాయి. ఆస్తి పన్ను రూపంలో రూ.1.80 కోట్లు రావాల్సి ఉంది. మొదటి ఆరు నెలల్లో రూ.95 లక్షలు రావాల్సి ఉంది. కాగా ఇప్పటివరకు 500 ఆవాసాల నుంచి రూ.30 లక్షలు వసూలయ్యాయి. వారంతా 5 శాతం రాయితీ ఉపయోగించుకొని చెల్లించిన వారే.

▸ చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాల్లో 8,122 నిర్మాణాలు ఉన్నాయి. వాటి ద్వారా రూ.4.84 కోట్లు రావాల్సి ఉంది.మొదటి ఆరు నెలల ఆస్తి పన్ను రూ. 2.42 కోట్లతోపాటు పాత బకాయిలు రూ. 1.41 కోట్లు వసూలు కావాల్సి ఉంది.అందులో ఇప్పటివరకు 1,640 నిర్మాణాల ద్వారా రూ.2.28 కోట్లు వసూలైంది. ఇంకా 6,482 నిర్మాణాల పన్నులు వసూలు కావాల్సి ఉంది. ఇక చౌటుప్పల్ పట్టణంలోని 4,720 నిర్మాణాల ద్వారా రూ.1.18 కోట్లు రావాల్సి ఉంది. అందులో మొదటి ఆరు నెలల పన్ను రూ.59.34 లక్షలు చెల్లించాల్సి ఉండగా, ఇప్పటి వరకు 643 నిర్మాణాల వారు రూ.25.02 లక్షలు చెల్లించారు.

▸ భూదాన్‌పోచంపల్లిలో 4,732 ఆవాసాల ద్వారా రూ.1.48 కోట్ల ఆస్తిపన్ను వసూలు కావాల్సి ఉండగా, మొదటి ఆరు నెలల్లో రూ.74 లక్షలు వసూలు రావాల్సి ఉంది.అందులో ఇప్పటివరకు రూ.28.57 లక్షలు మాత్రమే వసూలైంది. ఇంకా రూ.45.43 లక్షలు వసూలు కావాల్సి ఉంది.

▸ ఆలేరు మున్సిపాలిటీలో 4,713 ఆవాసాల ద్వారా రూ.1.22 కోట్ల ఆస్తిపన్ను చెల్లించాల్సి ఉంది.మొదటి ఆరు నెలల్లో చెల్లించాల్సిన రూ.61.23 లక్షలకు గాను 1713 నిర్మాణాల ద్వారా రూ.32.66 లక్షలు చెల్లించారు.

నోటీసులు జారీ చేస్తున్నా..

నిబంధనల ప్రకారం ఏటా ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు ఆస్తిపన్ను నోటీసులను సంబంధిత మున్సిపాలిటీ మే, జూన్ నెలల్లో జారీ చేస్తోంది. ఈనెల 30వ తేదీలోగా చెల్లించాలని చెబుతోంది. ఇక అక్టోబరు నుంచి మార్చికి సంబంధించిన పన్నును డిసెంబర్‌లో చెల్లించాల్సి ఉన్నా పట్టించుకోకపోవడంతో 2 శాతం వడ్డీ తప్పడం లేదు. మరోవైపు డిమాండ్ నోటీసు జారీ చేయకముందు, ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎర్లీ బర్డ్ స్కీంకింద ఏప్రిల్ నెలలోనే ముందస్తుగా పన్ను చెల్లిస్తే 5 శాతం రాయితీ కూడా ఉంది. దానిని కూడా ప్రజలు పెద్దగా పట్టించుకోకపోవడంతో నష్టపోతున్నారు. జూన్ 30లోగా చెల్లించకపోవడంతో మున్సిపాలిటీల్లోని వేలాది కుటుంబాలు అదనంగా వడ్డీ చెల్లించాల్సి వస్తోంది.

నేటి నుంచి రైతుబంధు

- జిల్లాకు రూ.304 కోట్లు విడుదల
- 2,66,676 మంది రైతులు
- గత సీజన్‌కంటే అదనంగా 12,666 మందికి సాయం
- రైతుల్లో హర్షం



భువనగిరిటౌన్ : రైతులకు శుభవార్త.. సోమవారం నుంచి అర్హులైన రైతుల ఖాతాల్లో రైతుబంధు డబ్బులు జమకానున్నాయి. వానాకాలం పంట కోసం ఎకరాకు రూ.5వేల చొప్పున.. నేరుగా రైతుల ఖాతాల్లో డబ్బులు వేయనున్నారు. ఇందుకు సంబంధించి వ్యవసాయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. రైతులకు ప్రతి సీజన్‌లో ప్రభుత్వం పంట పెట్టుబడి సాయం అందజేస్తుంది. ఇప్పటి వరకు 10 విడతలు అందజేసింది. ప్రస్తుతం 11 విడత నగదును విడతల వారీగా రైతుల ఖాతాల్లో జమ చేయనుంది.

లబ్ధి పొందనున్న రైతులు ఇలా..

వానాకాలంలో 2,66,676 మంది రైతులకు రైతుబంధు సాయం అందనుంది. ఇందుకోసం ప్రభుత్వం రూ.304 కోట్లు విడుదల చేసింది. గత సీజన్‌లో 2,54,010 మంది రైతులకు పంట పెట్టుబడి సాయం అందజేశారు. ఈసారి అదనంగా మరో 12,666 మంది రైతులకు సాయం అందనుంది. అంతేకాకుండా కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులతో పాటు ఇప్పటికే రైతుబంధు తీసుకుంటున్న వారు మార్పులు, చేర్పులు చేసుకోవడానికి కూడా ప్రభుత్వం అవకాశం కల్పించినందున మరికొందరు పెరిగే అవకాశం లేకపోలేదు.

రైతుల హర్షం

ప్రభుత్వ నిర్ణయంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఇప్పుడిప్పుడే వర్షాలు కురుస్తుండడంతో రైతులు వ్యవసాయ పనులను ప్రారంభించారు. విత్తనాలు, ఎరువులను సమకూర్చుకుంటున్నారు. ఈ తరుణంలో రైతుబంధు నగదు చేతికిరానుండడంతో కొంత ఊరట లభించనుంది.

కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకం పొందినవారు దరఖాస్తు చేసుకోవాలి

2023 జూన్ 18వ తేదీలోపు కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు రైతుబంధు సాయం కోసం దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టాదారు పాస్ పుస్తకం, బ్యాంకు ఖాతా మొదటి పేజీ జిరాక్స్, సెల్ నంబర్లను రైతు వేదికల్లో వ్యవసాయ విస్తరణ అధికారులకు అందజేయాలని సూచించారు. అంతేకాకుండా ఇప్పటికే రైతుబంధు సాయం పొందుతున్న రైతులు బ్యాంక్ ఖాతా నంబర్ మార్పు చేసుకోవడానికి అవకాశం కల్పించినట్లు వివరించారు. బ్యాంక్ ఖాతా ఐఎఫ్‌ఎస్‌సీ నంబర్ ఇవ్వని రైతులు తమ పాస్ పుస్తకం ఏఈఓలకు అందజేయాలని కోరారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పల్లెలకు మహర్దశ



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి

- ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

భువనగిరి : బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే పల్లెలకు మహర్దశ చేకూరుతుందని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. భువనగిరి మండలం మన్నెవారిపంపు గ్రామంలో ఆదివారం నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు గ్రామాలు ఏమాత్రం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. స్వరాష్ట్రంలో పెద్ద ఎత్తున నిధులు కేటాయించి అన్ని రకాల మౌలిక సౌకర్యాలు సమకూర్చుతుండడంతో కొత్తరూపును సంతరించుకుంటున్నాయన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నారని తెలిపారు. ఆసరా పింఛన్‌తో కోట్లాది మందికి అండగా నిలుస్తున్నారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులపై ప్రజలు పెద్ద సంఖ్యలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్‌లో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం 40 కుటుంబాలకు పైళ్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఏనుగు సంజీవరెడ్డి, బీఆర్‌ఎస్ మండల కమిటీ అధ్యక్షుడు జనగాం పాండు, ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ అబ్బగాని వెంకట్, మాజీ ఎంపీపీ కేశవపట్నం రమేష్, చందుపట్ల పీఏసీఎస్ మాజీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, నాయకులు రాఘవేందర్‌రెడ్డి, తాజ్‌పూర్ గ్రామశాఖ అధ్యక్షుడు ర్యాకల శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ బోయినీ పాండు, ఉప సర్పంచ్ భానుచందర్‌రెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

హిందూధర్మ పరిరక్షణకు కంకణబద్ధులు కావాలి



నూతన కమిటీతో ధర్మ ప్రచార సమితి సభ్యులు

రామన్నపేట : హిందూధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలని హిందూ ధర్మప్రచార తెలంగాణ విభాగ్ వెంకటేశ్వర జాదవ్, తెలంగాణ ధూపదీప నైవేద్యం సంఘం అధ్యక్షుడు డాక్టర్ రామలింగేశ్వరశర్మ అన్నారు. ఆదివారం రామన్నపేటలో జరిగిన విశ్వహిందూ పరిషత్, ధర్మ ప్రచార సమితి, గ్రామసత్ సంఘాల సమ్మేళంనలో వారు మాట్లాడారు. హిందూ ఆచారాలు, సంప్రదాయాలు సనాతనమైనవని, యువత పాశ్చాత్య దేశాల సంస్కృతి మోజులో పడి విస్మరించరాదన్నారు. హిందూ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అలవాటు చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కోరారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ మండల అధ్యక్షుడిగా నోముల శ్రీనివాస్, సహాయసత్ సంఘ ప్రముఖునిగా దంతూరి యాదగిరి, సహాయ కార్యదర్శిగా రాపోలు అండాలును ఎన్నుకున్నారు. సమ్మేళనంలో వీహెచ్‌పీ తెలంగాణ ప్రాంత సహాయ కార్యదర్శి తొట్ట భానుప్రసాద్, జిల్లా అధ్యక్షుడు గరిసె శేఖర్, జిల్లా సహాయ కార్యదర్శి యతిరాజ స్వామి ధర్మరక్షణ్ ప్రముఖ్ పసునూరి నిత్యానందం తదితరులు పాల్గొన్నారు.

సరికొత్తగా ఇండోర్ స్టేడియం



బ్యాడ్మింటన్ కోర్టు



టేబుల్ టెన్నిస్ కోర్టు

- రూ.15.30 లక్షలతో పునరుద్ధరణ
- రెండు బ్యాడ్మింటన్, రెండు టేబుల్ టెన్నిస్ కోర్టులు
- అందుబాటులో క్యారమ్స్, చెస్ బోర్డులు
- ఆకట్టుకునేలా పేయింటింగ్
- ప్రారంభానికి సన్నాహాలు



ఆకర్షణీయంగా రూపుదిద్దుకున్న ఇండోర్ స్టేడియం

భువనగిరి : జిల్లా కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న ఇండోర్ స్టేడియం నూతన హంగులను సంతరించుకుంది. నాలుగు రకాల కోర్టులు, ఆకట్టుకునేలా పేయింటింగ్, లైటింగ్ వ్యవస్థ వంటి సౌకర్యాలతో అధునాతనంగా రూపుదిద్దుకుంది. వారం రోజుల్లో స్టేడియాన్ని ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

పట్టణ ప్రగతి, జనరల్ ఫండ్‌తో అభివృద్ధి

భువనగిరిలోని తారాకరామనగర్‌లో గల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల సమీపంలో ఇండోర్ స్టేడియం నిర్మించారు. పేరుకే ఇండోర్ స్టేడియం తప్ప.. కోచ్, కోర్టులు, లైటింగ్ వంటి సౌకర్యాలు లేకపోవడంతో క్రీడాకారులు, విశ్రాంతి ఉద్యోగులు, యువత ఇక్కడ ఆటలు ఆడానికి అసక్తి చూపేవారు కాదు. దీనికి తోడు స్టేడియం శిథిలావస్థకు చేరింది. క్రీడాకారులు, స్థానికుల విజ్ఞప్తి మేరకు పట్టణ ప్రగతి నిధులు రూ.13 లక్షలు, జనరల్ ఫండ్ రూ.2.20 లక్షలు కేటాయించి పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఇందులో భాగంగా స్టేడియాన్ని పేయింగింగ్‌తో ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు.స్టేడి యం వెలుపల ఒలింపిక్ మెడల్ గ్రహీత నిఖత్ జరీన్, బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెంల గోపిచంద్ బొమ్మలు వేశారు.

నాలుగు రకాల కోర్టులు..

పునురుద్ధరణ పనుల్లో భాగంగా స్టేడియంలో నాలుగు రకాల క్రీడా కోర్టులు ఏర్పాటు చేశారు. వీటిలో రెండు బ్యాడ్మింటన్, రెండు టేబుల్ టెన్నిస్ కోర్టులున్నాయి. వీటితో పాటు రెండు క్యారమ్స్, చెస్ బోర్డులు అందుబాటులో ఉంచారు. గతంలో చెక్క కోర్టు ఉండగా దాని స్థానంలో సింథటిక్ కోర్టు ఏర్పాటు చేశారు. అంతేకాకుండా క్రీడాకారులు రాత్రి వేళల్లో ఆడుకోవడానికి, టోర్నమెంట్లు నిర్వహించినా ఇబ్బందులు తలెత్తకుండా లైటింగ్ వ్యవస్థను ఆధునీకరించారు. క్రీడల నిర్వహణకు కేర్ టేకర్‌ను నియమించేందుకు కసరత్తు చేస్తున్నారు.

నారసింహుడికి నిత్యారాధనలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో ఆదివారం నిత్యారాధనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. వేకువజామునే ప్రధానాలయాన్ని తెరిచిన ఆచార్యులు సుప్రభాతం చేపట్టారు. అనంతరం స్వయంభూలకు బిందే తీర్థం, ఆరాధన, బాలభోగం, నిజాభిషేకం, సహస్రనామార్చన చేపట్టి తులసీదళాలతో అర్చించారు. ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజ వాహనసేవ, నిత్యకల్యాణం, జోడు సేవలు జరిపించారు. రాత్రి శ్రీస్వామి వారికి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని మూసివేశారు. సువర్ణ పుష్పార్చన, వేద ఆశీర్వచనంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.



స్వామి దర్శనానికి ప్రధానాలయంలో బారులుదీరిన భక్తులు

27న సైన్స్ ఉపాధ్యాయులకు టెలీ కాన్ఫరెన్స్

(రామగిరి) నల్లగొండ : రాష్ట విద్యా పరిశోధన శిక్షణ మండలి హైదరాబాద్ ఆధ్వర్యంలో ఈ నెల 27 తేదీన ఇన్‌స్పైర్ అవార్డ్స్ నామినేషన్లపై సైన్స్ ఉపాధ్యాయులకు టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్‌స్పైర్ అవార్డుల నామినేషన్లపై విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకను వెలికితీసి వినూత్న ఆలోచనలతో ప్రాజెక్టులు తయారు చేసేలా శిక్షణ ఇస్తారని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు, సైన్స్, గణిత ఉపాధ్యాయులు టెలీ కాన్ఫరెన్స్‌లో పాల్గొనాలని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం సైన్స్ అధికారి వనం లక్ష్మీపతి సెల్ నంబర్ 9848578845ను సంప్రదించాలని సూచించారు.

హైవేపై.. పోలీస్ ఫోకస్ !

- రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు
- జీఎమ్మార్ సంస్థ సమన్వయంతో సూచికలు, సిగ్నల్స్ ఏర్పాటు
- అవసరమున్న చోట స్పీడ్ బ్రేకర్లు, విద్యుత్ దీపాలు కూడా..
- రోడ్డు వెంట గ్రామాల్లో పోలీస్ కళాజాతాలతో ప్రమాదాలపై అవగాహన


నకిరేకల్‌లోని పద్మానగర్ జంక్షన్

నకిరేకల్ : జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు పోలీస్ యంత్రాంగం ప్రత్యేక చర్యలకు శ్రీకారం చుట్టింది. ఇటీవల హైవేపై జరుగుతున్న వరుస రోడ్డు ప్రమాదాలపై పోలీస్‌శాఖ అప్రమత్తమైంది. నల్లగొండ ఎస్పీ అపూర్వరావు ఆదేశాల మేరకు ప్రత్యేక పోలీస్ బృందం, జీఎమ్మార్ సంస్థ అధికారులు, సిబ్బంది సమన్వయంతో హైవేపై పర్యటిస్తూ ప్రమాద నివారణ చర్యలు చేపడుతున్నారు. జీఎంఆర్ సంస్థ రూ.1740 కోట్లు వెచ్చించి బీవోటీ పద్ధతిలో 65వ నంబర్ రహదారిని నిర్మించారు. ఉమ్మడి జిల్లాలో ఈ రహదారి181 కి. మీ. ఉంది. చౌటుప్పల్ నుంచి కోదాడ వరకు జాతీయ రహదారిపై ఉమ్మడి జిల్లాలో 11పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. ఈ రహదారిపై పూర్తిస్థాయిలో ప్రమాదాల హెచ్చరిక బోర్డులు, సర్వీస్ రోడ్లపై స్పీడ్ బ్రేకర్లు నిర్మించలేదు. కూడళ్ల వద్ద పూర్తి స్థాయిలో వెలుగులు లేక రాత్రి పూట ప్రమాదాలు జరుగుతున్నాయి. జాతీయ రహదారిపై గ్రామాలు మండల కేంద్రాల వద్ద ఎక్స్ వై జంక్షన్లు, రోడ్డు క్రాసింగ్‌ల వద్ద సరైన విద్యుత్ దీపాలు హెచ్చరికల దీపాలు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. చౌటుప్పల్ శివారు లోని పంతంగి టోల్ ప్లాజా నుంచి కేతేపల్లి శివారులోని కొర్లపాడు టోల్ ప్లాజా వరకు ఆయా రోడ్డు క్రాసింగ్‌ల వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి.


తాటికల్ అండర్ పాస్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లు

సూచిక బోర్డులను గమనించాలి

జాతీయ రవాదారిపై నిత్యం ఎక్కడో ఒక చోట రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. నకిరేకల్ నియోజకవర్గంలో గుండ్రాంపల్లి నుంచి టేకుమట్ల వరకు 19 బ్లాక్ స్పాట్‌లను గుర్తించాం. వాహనదారులు రోడ్డుపై ఏర్పాటు చేసి ప్రమాద సూచిక బోర్డులను గమనించాలి. పక్షం రోజుల నుంచి ఎస్పీ అపూర్వరావు ఆదేశాల మేరకు హైవే జీఎంఆర్ అధికారులతో ప్రమాద నివారణ చర్యలు చేపడుతున్నాం. వాహనదారులు ట్రాఫిక్ నింబంధనలు పాటించాలి.

–అంజయ్య, రోడ్డు సేఫ్టీ ప్రత్యేక అధికారి, ఎస్పీ కార్యాలయం

నివారణ చర్యలు ఇలా..

ఎస్పీ అపూర్వరావు ఆదేశాల మేరకు ఎస్పీ కార్యాలయ విభాగం రోడ్డు సేఫ్టీ ప్రత్యేక అధికారి అంజయ్య ఆధ్వర్యంలో హైవే వెంట పర్యటించి ప్రమాదాలు జరిగే ప్రాంతాల వద్ద ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఆయా టోల్‌ప్లాజా వద్ద ఉన్న జీఎంఆర్ సంస్థ అధికారులతో చర్చించి ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అక్కడ చేపట్టాల్సిన పనులను చేయిస్తున్నారు. వారం రోజుల క్రితం ఇద్దరి ప్రాణాలను బలిగొన్న తాటికల్ అండర్ పాసింగ్‌కు ఇరు వైపులా స్పీడు బ్రేకర్లను నిర్మించారు. రోడ్డు చెదిరిపోయిన పేయింటింగ్ సిగ్నల్స్‌ను తిరిగి రాయిస్తున్నారు. జంక్షన్లు, రోడ్డు క్రాసింగ్‌ల వద్ద నూతనంగా విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయిస్తున్నారు. రోడ్డుపై రాత్రి వేళల్లో పాడి గేదెల వచ్చి ప్రమాదాలకు కారణం అవుతున్నందున వాటి కొమ్ములకు లైటింగ్‌తో కనిపించేలా రేడియం స్టిక్కర్లను అంటించి యాజమానులకు అవగాహన కల్పిస్తున్నారు. హైవే వెంట ఉన్న గ్రామాల్లో క్రాసింగ్‌ల వద్ద జరిగే ప్రమాదాలపై కూడా పోలీస్ కళాజాతా ప్రదర్శనలు ఇస్తూ అవగాహన కల్పిస్తున్నారు.


అండర్ పాస్ వద్ద ఏర్పాటు చేసిన లైట్లు

క్లుప్తంగా

ట్రాక్టర్ కిందపడి యువకుడి దుర్మరణం


శ్రీరాం(ఫైల్)

పాలకవీడు: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కిందపడి ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన పాలకవీడు మండలంలోని జాన్ పహాడ్ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జాన్‌పహాడ్ గ్రామానికి చెందిన తవిడబోయిన శ్రీరాం(22) చిన్నతనంలో తల్లిదండ్రులు చనిపోవడంతో అమ్మమ్మ వద్ద పెరిగాడు. శ్రీరాం ట్రాక్టర్‌తో పొలం దున్నుతుండగా ఫిట్స్ రావడంతో అదే వాహన టైరుకింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. శ్రీరాం తాత పిట్టల చిన్నసైదులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబల్ ఉపేంద్రచారి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

చిట్యాల: జాతీయ రహదారిపై చిట్యాల మండలం వెలిమినేడు గ్రామ శివారులో శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. వెలిమినేడు గ్రామ శివారులోని హనుమాన్ ఆలయం సమీపంలో విజయవాడ వైపునకు నడుచుకుంటూ వెళుతున్న గుర్తుతెలియని వ్యక్తిని వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతను తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహం పైనుంచి పలు వాహనాలు వెళ్లడంతో ఛిద్రమైంది. మృతుడి వయస్సు సుమారుగా 50–55 ఏళ్ల మధ్యలో ఉంటుందని, ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఇరుగు రవి తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


చంద్రియా మృతదేహం

మేళ్లచెరువు : విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మేళ్లచెరువు మండలంలోని కప్పలకుంట తండా గ్రామపంచాయతీ పరిధిలోని శివబాలాజీనగర్ తండాలో ఆదివారం చోటు చేసుకుంది. శివబాలాజీనగర్ తండాకు చెందిన చంద్రియా (65) తన వ్యవసాయ భూమిలో తెగిపడిన విద్యుత్ తీగలు గమనించలేదు. చంద్రియా పని చేసుకుంటున్న సమయంలో తీగలకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. స్థానిక రైతులు గమనించేలోపే మృతిచెందాడు. మృతుడి భార్య మోతీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

గడ్డి మందు తాగిన యువతి మృతి


సంధ్య(ఫైల్)

పెద్దవూర: గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువతి మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దవూర మండలంలోని జయరాంతండాకు చెందిన కెతావత్ పాండుకు ఇద్దరు భార్యలు ఉన్నారు. పెద్ద భార్య కీరికి ఇద్దరు కూతుళ్లు. వీరిద్దరికి వివాహాలు అయిపోయాయి. 22 ఏళ్ల క్రితం పాండు రెండో వివాహం చేసుకున్నాడు. చిన్న భార్య రాజీకి కూతురు సంధ్య(18), ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆస్తుల విషయంలో కొంతకాలంగా వీరి కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 22వన పాండు, చిన్న భార్య రాజీకి గొడవ జరిగింది. ఈ గొడవలో పాండు, అతని మొదటి భార్య కీరి, కుటుంబ సభ్యులు రాజీని, ఈమె కూతురు సంధ్యను తిట్టారు. దీంతో సంధ్య తీవ్ర మనస్తాపానికి గురై అదే రోజు వ్యవసాయ పొలంలోకి వెళ్లి గడ్డి మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను నాగార్జునసాగర్ కమలానెహ్రూ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతిచెందింది. సంధ్య ఇంటర్మీడియట్ పూర్తి చేసింది. మృతురాలి తల్లి రాజీ ఫిర్యాదు మేరకు పాండు, అతని పెద్ద భార్య కీరి, వారి కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పచ్చిపాల పరమేష్ తెలిపారు.

ఉరేసుకుని యువకుడి బలవన్మరణం


రాము(ఫైల్)

యాదగిరిగుట్ట రూరల్: ఉరేసుకుని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు.ఈ ఘటన యాదగిరిగుట్ట మండలంలోని వంగపల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. వంగపల్లి గ్రామానికి చెందిన యాకరి రాము (22) యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపోలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజువారీలాగే శనివారం విధులు నిర్వర్తించి తిరిగి ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి సమయంలో ఇంట్లోనే తన గదిలో చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు లేచి చూసేసరికి అప్పటికే మృతిచెందాడు. రాము ఆత్మహత్య చేసుకునే ముందు లవ్ యూ రా తమ్ముడు..అని స్టేటస్ పెట్టుకున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతుడి తండ్రి అంజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైదయ్య తెలిపారు.

రామాపురంలో...

నేరేడుచర్ల : ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని రామాపురం గ్రామానికి చెందిన మొండె నాగరాజు (35) కొంతకాలంగా మద్యానికి బానిసగా మారాడు. ఆర్థిక ఇబ్బందులకు తట్టుకోలేక శనివారం మధ్యాహ్నం ఇంటి వద్దనే గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపారు.

చేపల చెరువులో విష ప్రయోగం

- క్వింటా చేపలు మృతి


చనిపోయిన చేపలను పరిశీలిస్తున్న ఎస్ఐ

అడ్డగూడూరు : గుర్తుతెలియని వ్యక్తులు చేపల చెరువులో విష ప్రయోగం చేశారు. ఈ ఘటన అడ్డగూడూరు మండలం వెల్దేవి గ్రామంలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. వెల్దేవి గ్రామ సర్పంచ్ పిల్లి శ్రీకళ సుందర్ ఎకరం వ్యవసాయ భూమిలో చెరువు తవ్వించి చేపలు పెంచుతున్నాడు. ఉదయం చెరువు వద్దకు వెళ్లి చూడగా చేపలు చనిపోయి నీటిపై తేలియాడుతూ కనిపించాయి. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ ఉదయ్ కిరణ్, పశు వైద్యాధికారి నవీన్‌రెడ్డి చెరువును పరిశీలించారు. దుండగులు శనివారం రాత్రి విష ప్రయోగం చేయడంతో క్వింటా వరకు చేపలు మృతిచెందాయని గుర్తించారు. గత మే నెలలో కూడా దుండగులు చెరువులో విష ప్రయోగం చేశారని బాధితుడు తెలిపాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమతులు లేకుండా లక్కీ డ్రా


వలిగొండలో పోలీసులు అరెస్ట్ చేసిన నిందితులు

- ముగ్గురు నిర్వాహకుల అరెస్ట్

వలిగొండ : అనుమతులు లేకుండా ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసి లక్కీడ్రా నిర్వహిస్తున్న ముగ్గురిని భువనగిరి ఎస్‌ఓటీ పోలీసులు అరెస్ట్ చేశారు. వలిగొండ మండలంలోని వెల్వర్తికి చెందిన కూచిమల్ల సుధాకర్, కూచిమల్ల నాగేష్, కూచిమల్ల భగవంతు శ్రీ మత్స్యగిరి లక్ష్మీ నరసింహస్వామి ఎంటర్ ప్రైజెస్ పేరిట లక్ష్మీ డ్రా స్కీంను ఏర్పాటు చేశారు. వీరు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 6వేల మంది నుంచి ఒక్కొక్కరి వద్ద రూ.500 చొప్పున వసూలు చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని సాయి గణేష్ ఫంక్షన్ హాల్లో లక్కీ డ్రాకు ఏర్పాట్లు చేస్తున్న సమయంలో ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేశారు. నిందితుల నుంచి 6వేల లక్కీ డ్రా నాణేలు, బ్రోచర్, మూడు మొబైల్ ఫోన్లు, 1,23,800 రూపాయల నగదు, ఫ్లెక్సీ, 4 పుస్తకాలను స్వాధీనం చేసుకొని స్థానిక పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వలిగొండ ఎస్ఐ ప్రభాకర్ తెలిపారు.

లక్కీ డ్రా నిర్వాహకులపై కేసు

భూదాన్‌పోచంపల్లి : లైసెన్స్ లేకుండా నిబంధనలకు విరుద్ధంగా లక్కీ డ్రా నిర్వహిస్తున్న నలుగురిపై మల్కాజ్‌గిరి ఎస్‌ఓటీ పోలీసులు కేసు నమోదు చేశారు. భూదాన్‌పోచంపల్లి మండలంలోని ఇంద్రియాల గ్రామ శివారులోని జి.వెంకటేశ్ వ్యవసాయ క్షేత్రం వద్ద అమాయక ప్రజల నుంచి లక్కీ డ్రా పేరిట డబ్బులు వసూలు చేస్తున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేశారు. లక్కీడ్రా నిర్వహిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకొని వారివద్ద నుంచి 2,060 నగదు, బ్యాంకులో ఉన్న రూ. 1.91 లక్షల నగదు, లక్కీ డ్రా కూపన్స్, 4 సెల్‌ఫోన్లు, కారు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విక్రమ్‌రెడ్డి తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

పెన్‌పహాడ్ : గుర్తుతెలియని వ్యక్తులు తాళం వేసిన ఇంట్లోకి చొరబడి చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన పెన్‌పహాడ్ మండల పరిధిలోని అనంతారం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అనంతారం గ్రామానికి చెందిన పసుపులేటి జానయ్య సూర్యాపేటలో ప్రైవేట్ టీచర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం ఇంటికి తాళం వేసి జానయ్య పాఠశాలకు, అతడి భార్య కూలి పనులకు వెళ్లారు. గమనించిన దుండగులు ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న నాలుగు తులాల బంగారు, 30 తులాల వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. సాయంత్రం జానయ్య తిరిగి ఇంటికి రాగా చోరీ విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఏఎస్ఐ వెంకటరత్నం ఘటనాస్థలాన్ని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

మానవత్వం చాటుకున్న పూర్వ విద్యార్థులు


నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

- కోమాలోకి వెళ్లిన మిత్రుడి కుటుంబానికి రూ.లక్ష సాయం

కనగల్ : ఆపదలో ఉన్న మిత్రుడి కుటుంబానికి లక్ష రూపాయల ఆర్థికసాయం అందజేసి మానవత్వం చాటుకున్నారు.. జి.యడవల్లి ఉన్నత పాఠశాల 1997–98బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు. యడవల్లి పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థి పర్సనబోయిన చైత్రయ్య ఐదు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పత్రిలో చేర్పించగా కోమాలోకి వెళ్లినట్లు వైద్యులు తెలిపారు. నిరుపేద కుటుంబానికి చెందిన చైత్రయ్య కుటుంబాన్ని ఆదుకునేందుకు స్నేహితులు ముందుకొచ్చారు. తమకు తోచినంత పోగుచేసి చైత్రయ్య భార్యను రూ.లక్ష నగదు అందజేశారు. మిత్రుడు త్వరితగతిన కోలుకోవాలని దర్వేశిపురం ఆలయంలో పూజలు చేశారు.

ఆవులను తరలిస్తున్న ముగ్గురిపై కేసు



పోలీసులు పట్టుకున్న కంటైనర్

కోదాడరూరల్ : అనుమతులు లేకుండా కంటైనర్‌లో హైదరాబాద్‌కు తరలిస్తు న్న ఆవులను ఆదివారం పట్టుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు కోదాడ రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ సాయి ప్రశాంత్ తెలిపారు. విజయనగరం సంత నుంచి హైదరాబాద్‌కు ఓ కంటైనర్‌లో 39 ఆవులను తమిళనాడుకు చెందిన ముగ్గురు వ్యక్తులు తరలిస్తున్నారు. మార్గమధ్యలోని కోదాడ మండలం రామాపురం క్రాస్‌రోడ్‌లో చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేసి కంటైనర్‌లో పశువులు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ఆవులను గోశాలకు తరలించి వాటిని తరలిస్తున్న శ్రీనివాసన్, నరేందర్, సుధాకర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

డీసీఎం వాహనం పట్టివేత

చౌటుప్పల్ : అనుమతులు లేకుండా గోవులు, ఎద్దులను తరలిస్తున్న డీసీఎం వాహనాన్ని ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. ఒడిశా రాష్ట్రంలో కొనుగోలు చేసిన 57 ఆవులు, ఎద్దులను డీసీఎం వాహనంలో హైదరాబాద్‌లోని బహదూర్‌పురకు తరలిస్తున్నారు. ఆ క్రమంలో చౌటుప్పల్ మండల పరిధిలోని తూప్రాన్‌పేట గ్రామ శివారులో పోలీసులు పట్టుకున్నారు. గోవులు, ఎద్దులను భువనగిరిలోని పశువుల సంరక్షణ కేంద్రానికి, వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ దేవేందర్ తెలిపారు.

రామన్నపేటలో..


పోలీసులు పట్టుకున్న వాహనం

రామన్నపేట : అక్రమంగా తరలిస్తున్న పశువులను రామన్నపేట పోలీసులు ఆదివారం రామన్నపేట మండల కేంద్రంలోని సిరిపురం జంక్షన్‌వద్ద పట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నర్సన్నపేట, శ్రీకాకుళం ప్రాంతం నుంచి హైదరాబాద్‌కు రెండు డీసీఎంలలో పశువులను తరలిస్తున్నారు. పైనుంచి పూర్తిగా కవర్‌కప్పి ఎవరికీ అనుమానం రాకుండా వ్యవహరించారు. మండల కేంద్రంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా పశువుల అక్రమ రవాణా వెలుగు చూసింది. జంతు సంరక్షణ చట్టంకు విరుద్ధంగా 107 పశువులను తరలిస్తున్న తొమ్మిది మంది వ్యక్తులపై కేసు నమోదు చేయడంతోపాటు రెండు డీసీఎంలను, ఆరు సెల్‌ఫోన్లను సీజ్ చేశారు. పట్టుబడిన పశువులను భువనగిరి పశువుల సంరక్షణ కేంద్రానికి తరలించారు. పట్టుబడిన పశువులలో ఆవులు కూడా ఉన్నాయని ఎస్ఐ లక్ష్మయ్య తెలిపారు.

నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

ఆలేరురూరల్ : ఆలేరు పట్టణ శివారులో ఆదివారం 17కిలోల నకిలీ పత్తి విత్తనాలలను పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు పట్టుకున్నారు. ఆలేరులోని రెడ్డిగుడెం శివారులో మల్‌రెడ్డి పృథ్వీరెడ్డి వ్యవసాయ బావి దగ్గర ఎచ్‌టి బీటీ–3 పత్తి విత్తనాలను నిల్వ చేశారన్న సమాచారంతో ఎస్ఐ వెంకట శ్రీను, వ్యవసాయ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. మల్‌రెడ్డిని అదుపులోకి తీసుకొని విచారించగా సత్తెనపల్లికి చెందిన పెరుమాల్‌రావు వద్ద కొనుగోలు చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు. కాగా, మల్‌రెడ్డి వద్ద ఈ నెల 5వ తేదీన 6కిలోల పత్తి విత్తనాలను పోలీసులు పట్టుకున్నారు.

మిర్యాలగూడ హౌసింగ్‌బోర్డు కాలనీలో చోరీ


దుండగులు తెరిచిన బీరువా

మిర్యాలగూడ అర్బన్: గుర్తుతెలియని వ్యక్తులు ఓ ఇంటి కిచెన్ తలుపులు పగులగొట్టి లోనికి చొరబడి చోరీకి పాల్పడ్డారు. మిర్యాలగూడ పట్టణంలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మిర్యాలగూడ పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో నివాసముంటున్న గుంటోజు సతీష్ స్థానిక బాటా షోరూంలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం డ్యూటీకి వెళ్లి రాత్రి 11 గంటలకు తన నివాసానికి చేరుకుని నిద్రపోయాడు. ఆదివారం తెల్లవారుజామున గుర్తు తెలిని వ్యక్తులు కిచెన్ తలుపులను పగులకొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువాలో దాచిన 4.5 తులా బంగారు ఆభరణాలతో పాటు రూ.25వేలను చోరీ చేశారు. తెల్లవారాక బీరువా తెరిచి ఉండటంతో చోరీ జరిగిందని గుర్తించారు. సమాచారం ఇవ్వడంతో వన్‌టౌన్ పోలీసులతో పాటు డీఎస్పీ వెంకటగిరి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్ఐ అనంతుల శివతేజ్ పేర్కొన్నారు.

నీలగిరిలో నిర్బంధ తనిఖీలు

- ధ్రువపత్రాలు లేని 24 వాహనాలు స్వాధీనం


అనుమానితులకు కౌన్సిలింగ్ ఇస్తున్న పోలీసులు

నల్లగొండ క్రైం : నల్లగొండ పట్టణంలో ఆదివారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సతీష్‌నగర్‌లో నిర్వహించిన నిర్బంధ తనిఖీల్లో సరైన ధ్రువపత్రాలు లేని 24 బైక్‌లను స్వాధీనం చేసుకుని, 32మంది అనుమానితులను విచారించారు. వాహనాల డాక్యుమెంట్లను పరిశీలించారు. ప్రజల్లో పోలీసుల పట్ల భరోసా, సంఘ విద్రోహులపట్ల కఠినంగా వ్యవహరించేందుకే ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. తనిఖీల్లో సీఐలు గోపి, పీఎన్‌డీ ప్రసాద్, ఆదిరెడ్డి, ఎస్సైలు కంచర్ల భాస్కర్‌రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, సంపత్,సైదులు, సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ పార్లమెంట్ కమిటీలో ఇద్దరికి చోటు

చౌటుప్పల్: తెలుగుదేశం పార్టీ భువనగిరి పార్లమెంట్ కమిటీలో చౌటుప్పల్ మండలానికి చెందిన ఇద్దరికి చోటు లభించింది. చౌటుప్పల్ మండల పరిధిలోని చింతలగూడెం గ్రామానికి చెందిన గుమ్మడి గోవర్ధన్‌రెడ్డి పార్లమెంట్ కమిటీ కార్యనిర్వహణ కార్యదర్శిగా, చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామానికి చెందిన సిలివేరు నర్సింహమ్మ పార్లమెంట్ కమిటీ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు.



గోవర్ధన్‌రెడ్డి, సిలువేరు నర్సింహ

జాలరికి చిక్కిన భారీ చేప

నల్లగొండ జిల్లా కేంద్రం శివారులోని పానగల్లు ఉదయ సముద్రం రిజర్వాయర్‌లో ఆదివారం ఖాజీరామారం గ్రామానికి చెందిన జాలర్లు చేపలు పట్టారు. చెరువులో ఓ జాలరి వేసిన గాలానికి 20కిలోల బొచ్చ చేప చిక్కింది. గ్రామస్తులు ఆ భారీ చేపను చూసేందుకు పోటీపడ్డారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నల్లగొండ



ఎనిమిది మంది జూదరుల అరెస్ట్

హుజూర్‌నగర్: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి 8మంది జూదరులను అరెస్ట్ చేశారు. హుజూర్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో కస్తూరి పుల్లమ్మ ఇంట్లో శనివారం రాత్రి పేకాట ఆడుతున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ దాడిలో అక్కడ పేకాట ఆడుతున్న కస్తూరి కిషోర్, జక్కవేని శ్రీను, ముంజల నాగరాజు, కలకోవ వెంకటేశ్వర్లు, మేదరిమెట్ల నర్సింహారావు, ముంజల సైదులు, జాకరపు కిరణ్, దేవరం సుధాకర్ రెడ్డిలను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ 12,540 నగదు, 8 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

గ్రామాల్లో ఆర్ఎంపీల వైద్యసేవలు కీలకం


రామ్మూర్తి యాదవ్‌ను సన్మానిస్తున్న ఆర్ఎంపీల అసోసియేషన్ నాయకులు

అర్వపల్లి: గ్రామాల్లో ఆర్ఎంపీల సేవలు ఎంతో కీలకమని తెలంగాణ హాస్పిటల్స్, నర్సింగ్‌హోమ్స్ అసోసియేషన్ ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఊర రామ్మూర్తియాదవ్ అన్నారు. ఆదివారం అర్వపల్లిలో జరిగిన ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలకు నిరంతరం ఆర్ఎంపీ వైద్యులు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నారని అన్నారు. తాను గత 40ఏళ్లుగా గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాంమ్మూర్తియాదవ్‌ను ఆర్ఎంపీల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్ఎంపీ, పీఎంపీల అసోసియేషన్ జిల్లా ఆర్గనైజర్ డాక్టర్ జేరుపోతుల లక్ష్మణ్, వేల్పుల రమేష్, బారి అశోక్, బాసాని లక్ష్మయ్య, మామిడి విజయ్, ఉపసర్పంచ్ వల్లాల రమేష్, ఎం. శేఖర్, గజ్జి శంకర్, దుబ్బాక ఎల్లంరాజు, ఆకారపు శ్రీను, బాబూరావు, ప్రభాకర్, భరత్ తదితరులు పాల్గొన్నారు.